క్లుప్తంగా

బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచరూరల్: బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం అన్నారు. మండలంలోని సంగం గ్రామంలో బానోతు రవి అధ్యక్షతన సోమవారం సీపీఐ గ్రామశాఖ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శిగా రెంటాల సుందర్‌రావు, సహాయ కార్యదర్శిగా చిలకంటి దుర్గారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, బి.రంజిత్, రవి, బత్తుల గోపాలకృష్ణ, సాయిలి శ్రీను, సత్యం, పిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం భద్రతండాకు చెందిన మొగిలి మల్లేశ్ సోమవారం కొత్తగూడెం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జూలూరుపాడు మండలంలోని సాయిరాంతండా సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోగా తలకు గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో కొత్తగూడెంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలకు టీవీ వితరణ



టీవీ అందిస్తున్న సుజాత

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట ప్రాథమిక పాఠశాలకు తన భర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూర్నపాక భాస్కర్ జ్ఞాపకార్థం సూర్నపాక సుజాత సోమవారం టీవీని బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కబ్బాకుల రవి, అరెం రవి, గ్రామస్తులు కిన్నెర నర్సయ్య, ఊకే కృష్ణ, కల్తి బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం హర్షణీయం

కొత్తగూడెంటౌన్: మాల మహానాడు వ్యవస్థాపకులు, కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు జెట్టి మోహన్ అన్నారు. సోమవారం రామవరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గడ్డం కృష్ణ, రామకృష్ణ, శరత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, దాతలు, స్థానికులు పాల్గొన్నారు.

అధిక నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న బయ్యా అభిమన్యు

ఇల్లెందు: ఈ నెల 12 నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అత్యధిక శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బయ్యా అభిమన్యు కోరారు. సోమవారం ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. చరణ్, పవన్, మల్లేశ్ పాల్గొన్నారు.

సర్వే నంబర్‌పై సందిగ్ధం

స్థల కేటాయింపులో సర్వే నంబర్ల వివాదం

- కోర్టును ఆశ్రయించిన సాగుదారులు
- స్పష్టత ఇవ్వాలని అధికారులకు కోర్టు ఆదేశం
- ఏఐ టెక్నాలజీతో సర్వేకు సమాయత్తం



గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూమి (ఇన్‌సెట్) అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ..

ఇల్లెందురూరల్: రెవెన్యూ, అటవీశాఖ, సింగరేణి, రైల్వే.. నాలుగు శాఖలకు సంబంధించి ఇల్లెందు పట్టణ, మండల పరిధిలో భూములు ఉన్నాయి. కానీ, ఏయే శాఖలకు ఎక్కడ భూములు ఉన్నాయి..? ఖాళీగా ఉన్నాయా..? ఎవరైనా ఆక్రమించారా..? అన్న వివరాలతో నివేదికలు మాత్రం ఏ శాఖ వద్ద లేకపోవడం గమనార్హం. ఫలితంగా భూముల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. చివరకు రెవెన్యూ అధికారులు ప్రకటించిన సర్వే నంబర్‌పై రైతులు కోర్టును ఆశ్రయించడం.. వాదనల్లో స్పష్టత లేక సమగ్ర సర్వేకు కోర్టు ఆదేశించడం చూస్తుంటే సంబంధిత శాఖలకు ఉన్న నిర్లక్ష్యం తెలుస్తోంది.

ప్రభుత్వ సంస్థల నిర్మాణం కోసం

ఇల్లెందులో తాజాగా సమీకృత గురుకులం, ఐటీఐ, వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం నిధులు కూడా కేటాయించగా రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలాల కోసం అన్వేషణ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ గురుకులానికి అవసరమైన 25 ఎకరాల స్థలాన్ని గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూమి ఎంచుకున్నారు. ఒకటి, రెండు సార్లు సర్వే చేసి సర్వే నంబర్ 549 పరిధిలోని ప్రభుత్వ భూమిగా నిర్ధారణకు వచ్చి ఫ్లెక్సీ పెట్టారు.

తరతరాలుగా సాగుచేస్తున్నాం..

రెవెన్యూ అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయగానే రైతుల్లో ఆందోళన మొదలైంది. తరతరాలుగా తమ కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించడం సరికాదని నలుగురు రైతులు రెవెన్యూ శాఖ జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డుల్లో తమ పేరిట నమోదైన వివరాలతో కోర్టును ఆశ్రయించారు. తమకు జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల్లో సర్వే నంబర్ 618గా ఉందని, తమ చుట్టూ ఉన్న సాగు భూములతోపాటు మున్సిపాలిటీ డంప్ షెడ్డుకు అప్పగించిన డాక్యుమెంట్‌లోనూ అదే నంబర్ ఉందని కోర్టుకు విన్నవించారు. ఇదే విషయమై కోర్టులో వాదనలు జరగగా సర్వే నంబర్ విషయంలో స్పష్టత లేకపోవడంతో ఆధునిక టెక్నాలజీతో మరోసారి సర్వే చేయాలని కోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించింది.

తొలిసారి ఏఐ టెక్నాలజీతో సర్వే

వివాదం నెలకొనడం, సర్వే నంబర్లు స్పష్టం చేయాలన్న కోర్టు ఆదేశంతో రెవెన్యూ అధికారులు మేల్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)ని వినియోగించి జిల్లాలో తొలిసారి సర్వే చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో సదరు భూములను సర్వే చేసే అవకాశం ఉంది. ఈ సర్వేతో తప్పిదం ఎక్కడ జరిగిందనేది వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఇదిలాఉండగా రెండు సర్వే నంబర్లు ప్రభుత్వ భూములేనని, ఏది స్పష్టమైనా స్వాధీనం చేసుకోవడం ఖాయమని అధికారులు చెబుతుండడం గమనార్హం.

రెండు రోజుల్లో పూర్తి చేస్తాం



ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనానికి కేటాయించిన సర్వే నంబర్ 549పై ప్రస్తుతం సాగులో ఉన్న రైతులు కోర్టును ఆశ్రయించారు. సదరు భూమి సర్వే నంబర్ 618గా వారు పేర్కొంటున్నారు. స్పష్టత కోసం కోర్టు ఆదేశించినందున ఒకటి, రెండు రోజుల్లో ఆధునిక విధానంలో సర్వే పూర్తి చేస్తాం.

–రవికుమార్, తహసీల్దార్, ఇల్లెందు మండలం

విద్య, వైద్యం అందించడమే లక్ష్యం



ఇల్లెందు: విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: గత పాలకులు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చకపోగా, తమ ప్రభుత్వం మాత్రం హామీలు అమలు చేస్తూనే విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల రూ.200 కోట్లు, ఐటీఐకి రూ.11 కోట్లు, వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.37 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. డంప్‌యార్డు సమీపాన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, క్యాంపు ఆఫీస్ ఎదుట గ్రంథాలయానికి ఇరువైపులా సింగరేణి స్థలంలో ఐటీఐ, వంద పడకల హాస్పిటల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా, ఇల్లెందులో రూ.1.25 కోట్ల వ్యయంతో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు నిధులు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ బలరాంనాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, చీమల నాగరత్నం, దొడ్డా డానియేల్, పులి సైదులు, పింగళి నరేశ్, మండల రాము, కల్తీ పద్మ, పాయం స్వాతి ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఇల్లెందురూరల్: ప్రతీ పల్లెలో అంతర్గత రహదారులు మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.3 కోట్లతో చేపట్టనున్న 61 సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాగా, నెహ్రూనగర్‌లో తాగునీటి ఎద్దడిపై స్థానికులు ఫిర్యాదు చేయగా వేసవి సమీపిస్తున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, పంచాయతీరాజ్ డీఈ రామకిషన్, ఏఈ రాజు, నాయకులు పులి సైదులు, రాము మహేశ్, చీమల నాగరత్నమ్మ, ముక్తి కృష్ణ, పూనెం సురేందర్, రాంబాబు, ఆముదాల ప్రసాద్, తాటి భిక్షం, ఆవుల గోపి, కల్తి పద్మ, పాయం స్వాతి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌లో ఎల్–1, ఎల్–2, ఎల్–3 అని విభజించడం వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని ప్రగతి శీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్రామాణికంగా చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేశారని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని ఆయన తెలిపారు.

అటు ఘాటు.. ఇటు హీటు..



గొడుగు పెట్టుకుని పనిచేస్తున్న మహిళలు

టేకులపల్లి: రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వివిధ పనులు చేసేవారు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు మూగ జీవాలకు సైతం వేసవి తాపానికి ఇబ్బంది ఎదురవుతోంది. మిర్చి కోతలు, మిర్చి ఏరివేత పనులు మాత్రం ఆగడం లేదు. మిర్చి ఘాటు.. ఎండ వేడిలోనూ మహిళలు మిర్చి ఏరుతున్నారు. సోమవారం టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ శాంతినగర్‌లో గొడుగు సాయంతో మిర్చి ఏరుతూ మహిళలు కనిపించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వెంకటేశ్ ఖని గుట్టపై స్వయంభూ శ్రీ భూనీల సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో పీవీకే మేనేజర్ శ్యాంప్రసాద్, వైవీరావు, రవీందర్, కిశోర్, ఏరియా వర్క్‌షాపు ఎస్ఈ ఉపేందర్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు సుమారు రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. డీజీఎం శివకేశవరావు, మజ్జిగ మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో అంతర్జాతీయస్థాయికి ఎదగాలి



క్రీడాకారులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

జూలూరుపాడు: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు లేళ్ల వెంకట్‌రెడ్డి, సీఐ ఇంద్రసేనారెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రంలో సోమవారం టీం గరుడ రెడ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, ఆర్.కె.నాయుడు, ధర్మరాజుల వెంకట నారాయణ, రాంశెట్టి రాంబాబు, నవీన్‌రాథోడ్, మిర్యాల కిరణ్‌కుమార్, మెంతుల కృష్ణ, షఫీ, అజయ్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్ట్ ఉద్యోగి ఈసం శేఖర్‌బాబు కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందించారు. తోటి ఉద్యోగులు సేకరించిన రూ.36 వేలు, ఎస్ఆర్ఎల్‌టీ కోల్ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు రూ.10 వేలు నగదును శేఖర్ తల్లికి అందజేశారు. కార్యక్రమంలో కె.వాసు, చిన్ని, రామచందర్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయిపూలే సేవలు మరువలేనివి



పాల్వంచ: నివాళులర్పిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు తదితరులు



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాల్వంచ/ఇల్లెందు: మహిళాలోకం కోసం సావిత్రీబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహిళల విద్య కోసం ఆమె చేసిన పోరాటాలను వివరించారు. పాల్వంచలో నిర్వహించిన కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, ఎస్‌వీఆర్‌కె.ఆచార్యులు, పైడిపల్లి మనోహర్, మహేశ్, రాము, దారా చిరంజీవి, శాంతివర్ధన్, శ్రీకాంత్, షఫీ తదితరులు పాల్గొన్నారు. ఇల్లెందులో నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్ నబీ, అవాజ్, మోహన్‌రావు, కృష్ణ, వజ్జ సురేశ్, పద్మ, రాజు, వీరయ్య పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్‌పై అవగాహన



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వేణుమాధవ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్‌పై దరఖాస్తుదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వేణుమాధవ్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు తొలుత ఆన్‌లైన్‌లో ఆస్తి వివరాలు, సబంధిత పత్రాల వివరాలను నమోదు చేసుకోవాలని, సంబంధిత ఆస్తి వాస్తవ అమ్మకపు విలువ ధ్రువపరిచి రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజును సరి చూసుకోవాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్ 2020 దరఖాస్తును చేసుకున్నారా..? కొత్త దరఖాస్తుకు వెళ్లాలనుకుంటున్నారా..? అనే విషయాలను నిర్ధారించుకొని ఆస్తి క్రమబద్ధీకరణ చార్జీలు, ఓపెన్ స్పేస్ కాంట్రిబూషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని, మార్చి 31వ తేదీలోపు చెల్లించేవారికే 25 శాతం రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు.

నేడు తరావీహ్ నమాజ్..



మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

ఇల్లెందురూరల్: మండలంలోని మోదుగలగూడెం దారుల్ ఉలూమ్ నబీ ఉల్ ఫలాహ్ స్కూల్‌లో మంగళవారం రాత్రి తరావీహ్ నమాజ్ నిర్వహిస్తున్నట్లు మతపెద్దలు మౌలానా ఇనాయితుల్లా రషీది, ఇబ్రహీం, అనామతుల్లా, సలామతుల్లా తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష ఆచరించే ముస్లింలు రోజూ ఐదు పూటలా నమాజ్ చేస్తారని, ఈ నెలలో ఇషా నమాజ్ తరువాత ప్రత్యేకంగా చేపట్టే నమాజ్‌ను తరావీహ్ నమాజ్‌గా పిలుస్తారని తెలిపారు. మంగళవారం రాత్రి మొదుగులగూడెం స్కూల్‌లో నిర్వహించే దువాకు ముస్లింలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కాగా, ఈ నెల 16, 27వ తేదీల్లో కాకతీయనగర్‌లోని జామియా ఫయూతిమాతుల్ జొహరి స్కూల్‌లో స్త్రీలకు ప్రత్యేకంగా తరావీహ్ నమాజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీఎంఎస్ చెప్పిందే నిజమైంది..



మాట్లాడుతున్న మాధవ్‌నాయక్

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల వేలంలో బీఎంఎస్ చెప్పిందే నిజమైందని, నాడు వేలం పాట వద్దని తప్పుచేసిన సంఘాలు కార్మికులకు క్షమాపణ చెప్పాలని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి బొగ్గు గనుల వేలంలో పాల్గొంటేనే సింగరేణికి లాభమని బీఎంఎస్ చెబుతూ వచ్చిందని, అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కోయగూడెం ఓసీ–3, జేవీఆర్‌ఓసీ–3 గనులు ప్రైవేట్ సంస్థల చేతిలో వెళ్లిపోయాయని పేర్కొన్నారు. జీవీ కృష్ణారెడ్డి, వడ్డెపల్లి కుమారస్వామి, ఊట్ల గణేశ్, భుక్య శ్రీను, కృష్ణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపు పునరుద్ధరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: మండలంలోని వేములవాడలో రేషన్‌షాపును పునరుద్ధరించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం డీటీ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా నిర్మించిన భవనంలో గతంలో రేషన్‌షాపు నిర్వహించేవారని, భవనం శిథిలావస్థకు చేరడంతో షాపును ముకుందాపురం గ్రామానికి మార్చారని చెప్పారు. భవనం మరమ్మతులు పూర్తయినా దుకాణాన్ని తిరిగి గ్రామంలో ఏర్పాటు చేయడం లేదన్నారు. ఐటీడీఏ పీఓకు సైతం ఫిర్యాదు చేశామని, మారుస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్తి సుభద్ర, గురువమ్మ, రమణ, వసంత, లక్ష్మి, నిర్మల, రాంబాయి, వీరస్వామి, సర్వన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో రామవరం

- డ్రెయినేజీలు తవ్వారు.. వదిలేశారు..
- ఇళ్ల మధ్య గుంతలతో ప్రజల ఇబ్బందులు
- అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం



రామవరం 7వ నంబర్‌బజార్‌లోని వీధిలో డ్రెయినేజీ కోసం తవ్విన గుంతలు

కొత్తగూడెంటౌన్: రామవరం ప్రాంతం సమస్యలతో నిండిపోయింది. ఇళ్ల మధ్య తవ్విన డ్రెయినేజీలను అలాగే వదిలేయడం, రోడ్లు అసంపూర్తిగా ఉండటం, బోర్లు వేస్తామని వేయకపోవడం లాంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి రామవరంలో 6, 7, 8, 9, 10, 11, 12 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో డ్రెయినేజీలు, రోడ్లు అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ కౌన్సిల్ గడువు ముగుస్తుందని గత జనవరి 27న అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావుడిగా కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారు. కొన్ని చోట్ల రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించారు. రామవరం మార్కెట్ ఏరియా, కొత్తగూడెం 29 వార్డు సన్యాసిబస్తీలో గుంతలు తవ్వి వదిలారు. రోజులు గడుస్తున్నా గుంతలను అలాగే వదిలేయడంతో ఇంట్లో నుంచి బయటికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ సన్యాసిబస్తీ, రామవరం వనందాస్‌గడ్డబస్తీ, రామవరం మార్కెట్ ఏరియా 7వ నంబర్‌బజార్‌లో డ్రెయినేజీల కోసం తవ్విన గుంతలు నెల రోజులుగా అలాగే ఉండటం, పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. వనందాస్‌గడ్డబస్తీలో రెండు బోర్లు వేస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు గత జనవరిలో హామీ ఇచ్చారు. ఒకచోట బోరు వేసినప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదు. మరో బోరు వేయాల్సి ఉంది. మార్కెట్ ఏరియా నుంచి పెద్ద చమాన్ వరకు, మార్కెట్ ఏరియా, చిన్న ఆస్పత్రి లైన్ ఇలా పలు ప్రాంతాల్లో రహదారులు గుంతలమయంగా మారిపోయాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల్లో జాప్యం జరిగింది..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పనుల్లో జాప్యం జరిగింది. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం. పనులు పూర్తి చేస్తాం. రామవరంలోని 7వ నంబర్‌బజార్‌లోని ఇళ్ల మధ్య డ్రెయినేజీలను త్వరలోనే పూర్తి చేస్తాం. వనందాస్‌గడ్డ బస్తీలో బోరు వేశాం. కనెక్షన్ త్వరలో ఇస్తాం. అన్ని పనులను పూర్తి చేస్తాం.

–రవికుమార్, డీఈ